

# మౌనం

## పులగం శివశంకరరావు

సన్నగా అలఘు అలలుగా నవ్వు

కళ్ళు తెరిచాను. ఎవరూ లేరు- ఎందుకుంటారు. అంతా భ్రమ

కళ్ళుమూసుకుని పడుకున్నాను. ఎంతసేపటికీ కునుకుపట్టడం లేదు. మంచం మీద నుంచి లేచాను.

టైం ఎంతయిందో చూస్తే రెండు గంటలు దాటింది. ఇంట్లోంచి ఆరుబయటకొచ్చాను.

పున్నమి వెన్నెల నిశ్శబ్దంగా కురుస్తోంది.

వాలుకుర్చీ తెచ్చి కూర్చున్నాను

ఏమిటో ఇలా ఒంటరిగా... తప్పదు. కొడుకులుంటే మాత్రం ఉద్యోగాల్ని వదులుకుని నా కోసం ఇక్కడ వుంటారా? వద్దులే, నన్ను రమ్మంటారు వాళ్ళతో పాటు వుండమని. ఈ అరవై దాటిన వయస్సులో.. ఈ పల్లెటూరిలో వుండడమే బాగుంది.

నిద్ర నుంచి మేల్కొలిపిన నవ్వు... ఒకసారి వినాలని వుంది.

ఆ నవ్వు నన్ను ఎంత వెనక్కి తీసుకెళ్ళింది?

బందరులో నేను డిగ్రీ చదువుతున్న రోజులు-

నేను అద్దెకుంటున్న ఇంటి వాళ్ళు నేనంటే చాలా అభిమానంగా వుండేవాళ్ళు. ఆమె నన్ను "తమ్ముడూ" అని పిలిచేది.

ఓ ఆదివారం మధ్యాహ్నం... గదిలో చదువుకుంటున్నాను.

అక్కవాళ్ళ ఇంటి లోంచి నవ్వులు విన

పడుతున్నాయి: అక్కడో ఎవరో అమ్మాయి మాట్లాడుతూ నవ్వుతోంది. ఆ నవ్వు.. పండి ఎండిన జిల్లేడు కాయ నుండి, తెల్లని నూలు కుచ్చుగా వున్న విత్తనాలు, వరుసగా గాలిలోకి తేలి పోతున్నట్టు... పుస్తకం మూసి వింటున్నాను. ఆ అమ్మాయి ఎవరో తెలుసుకోవాలని వుంది. పాట పాడమని అక్క అడిగింది. ఆ అమ్మాయి పాడడం మొదలు పెట్టింది. ఏటి అంచున గుబురుగా వుండే తెల్లని రెల్లుపూలు గాలికి వూగుతున్నట్లు... వేకువజామున పొగ మంచు తెరలుతెరలుగా పంట పొలాల్ని తాకుతున్నట్టు... ఆ పాట నా హృదయమంతటినీ అలుముకుంది. పాడడం అయిపోయింది. నేను పాట లోంచి తేరుకోలేకుండా వున్నాను.

"తమ్ముడూ!" వాకిట్లో అక్క పిలిచినట్లుంది.

బయటకొచ్చాను.

"ఈ అమ్మాయి మా మేనత్తకూతురు... శారద. బెజవాడ నుంచి వచ్చింది. శారదకి చంద్ర వాళ్ళ ఇల్లు చూపించిరా!" అంది.

ఆ అమ్మాయి నా వంక చూసింది. గొప్ప వెలుగు నా మీద పడినట్లయింది. స్వప్న కెరటాలు ఉవ్వెత్తున లేచి హృదయాన్ని గుద్దుకుని వొంగినట్లయింది.

బయట కొద్దిగా వాన తుంపర పడుతోంది. అక్క గొడుగు తెచ్చి శారదకు ఇచ్చింది. బయలుదేరాం. కొద్ది దూరం వెళ్ళాక చినుకులు పెద్దవయ్యాయి. తను గొడుగును నిటారుగా పట్టుకొంది. తను తడవడం లేదు. నేను తడుస్తున్నాను. జేబురుమాలు తీసి తలకు చుట్టుకున్నాను. ప్రక్క ప్రక్కనే నడుస్తున్నాం. నా గుండె వేగం హెచ్చింది. తనేమీ మాట్లాడలేదు. మధ్య మధ్యలో నా వంక చూస్తోంది. చంద్ర వాళ్ళ ఇల్లు చేరేసరికి నేను తడిసి ముద్దయిపోయాను. తను వసార్లోకి అడుగుపెడుతూ నాకు గొడుగు ఇచ్చి "అయ్యో! మీరు బాగా తడిసిపోయారండీ!" అంది. గొడుగులో చోటు ఇవ్వకపోయినా బాధపడలేదు నేను. కాని ఈ మాట అనేసరికి మలిపోయినట్లయింది. జవాబుగా ఏమనాలో నాకు అర్థం కాలేదు.

తిరిగి ఇల్లు చేరుకున్నాను.

"ఏంటి తడిసిపోయావు. పెద్ద గొడుగేగా" అక్క అడిగింది.

ఏమని చెప్పను? నవ్వి వూరుకున్నాను.

రాత్రి అయ్యేసరికి నాకు బాగా జలుబు చేసింది. తెల్లారి ఆలస్యంగా లేచాను. కాలేజీ కెళ్ళి సాయంత్రం ఇంటికొచ్చేసరికి శారద వాకిట్లో జామ చెట్టుకింద కుర్చీలో కూర్చుని వుంది. నన్ను చూసింది. నేను చూడనట్టు గదిలోకి వెళ్ళాను. గదిలోంచి ఆమె వైపు చూశాను. ఏదో పుస్తకాన్ని తిరగేస్తున్నట్లుంది. ఆమె ముంగురులు గాలికి వూగుతున్నాయి.

సౌందర్య సంకేతాలు విశ్వమంతటా వ్యాపిస్తున్నాయి.

ఆమె నుంచి దృష్టిని మరల్చలేకపోతున్నాను.

అక్క వచ్చి శారద ఎదురుగా మరో కుర్చీలో కూర్చుంది.

ఇంకా కాసేపటికి బావగారు, వాళ్ళ పిల్లలు జామ చెట్టు దగ్గరకు చేరారు.

శారద పాడడం మొదలు పెట్టింది. నేను నిలవ లేకుండా వున్నాను. దగ్గరగా వెళ్ళి వినాలని వుంది.

కాని వెళ్ళను. ఒకవేళ దగ్గరకు వెళ్ళినట్లయితే, నేను ఆ పాటలో కరిగిపోవడం ఆమె గమనించి కూడా ఏమీ చూడనట్లు ప్రవర్తిస్తే తట్టుకోలేను. అందుకే వెళ్ళను. గదిలో నుంచి ఆ పాట విన్నాను.

తర్వాత రోజూ సాయంత్రం జామ చెట్టు దగ్గర పాడుతూనే వుంది. నేను లోపలి నుంచి వింటూనే వున్నాను. బావి దగ్గర, వాకిట్లో, వసార్లో అప్పుడప్పుడు ఎదురు పడుతూనె వుంది. ఇద్దరి మధ్యా మాటలు లేవు, ఎదురుగా చూపులు లేవు.

వారం రోజులు గడిచాయి. ఆదివారం వచ్చింది.

శారదను బస్టాండు దాకా పంపించి రమ్మని అక్క చెప్పింది. శారద వూరెళ్ళిపోతుందంటే గుండె ఒక్కసారిగా బరువెక్కింది... ఆ అమ్మాయితో పాటు బయలుదేరాను. సూట్‌కేస్ పట్టుకున్నాను. రిక్షా ఎక్కాం. ఆమె వెనుకవైపున కూర్చుంది. నేను ముందువైపున కూర్చున్నాను. రిక్షాలోనూ మాటల్లేవు. బస్టాండు వచ్చేస్తుంది. రిక్షా దిగాం. తను ఎక్కబోయే బస్ సిద్ధంగా వుంది. నా కళ్ళలో తడి పొరలు కమ్ముకున్నాయి. తను చేతిలోని పుస్తకాన్ని నాకు అందిస్తూ "ఆటోగ్రాఫ్" అంది. నా కళ్ళల్లోని తడిని చూసింది. "మౌనం ఒక ప్రశ్న, ఒక జవాబు" సంతకం చేశాను. పుస్తకం తీసుకుని తను బస్ ఎక్కింది. నేను దాచుకోలేని కన్నీళ్ళతో ఇల్లు చేరాను.

తర్వాత ఏదో మాటల సందర్భాన అక్క చెప్పింది. నేను మాట్లాడడం లేదేంటని అడిగిందట శారద. ఆడపిల్లలంటే బిడియం అని అక్క చెప్పిందట.

ఆ నవ్వు కోసం, ఆ పాట కోసం తహతహలాడాను.

నేను అక్కడ వున్నన్ని రోజులూ శారద రాలేదు.

మా వూర్లో నాకు పంతులు ఉద్యోగం వచ్చిం తర్వాత, పెళ్ళి జరిగి, పిల్లలు పుట్టిన తర్వాత ఓసారి బందరు అక్కా వాళ్ళ ఇంటికి వెళ్ళాను. శారద గురించి అడిగితే... తనకు పెళ్ళయిందని, అత్తగారిది ఈ వూరేనని, ఇక్కడే ఉద్యోగం చేస్తూందని అడ్రసు చెప్పింది. నా గురించి కూడా శారద అడిగిందని అక్క చెప్పింది.

తర్వాత ఎన్నో సంవత్సరాలు పని మీద బందరు వెళ్ళినప్పుడల్లా శారదను చూడాలనిపించి, వాళ్ళ ఇంటి వైపు వెళ్ళి కూడా లోపలికి వెళ్ళకుండా తిరుగొచ్చాను. ఇదీ ఇన్ని సంవత్సరాలూ హృదయంలో దాగి ప్రశ్నగా మిగిలిన బాధ.

గతాన్ని నెమరువేసుకుంటూ ఆమెని తల్చుకుంటూ తెల్లారేవరకూ ఆ వెన్నెల్లో కూర్చుండిపోయాను.

బందరు బయలుదేరి వెళ్ళాను. వెళ్ళేసరికి మధ్యాహ్నమయ్యింది.

శారద వాళ్ళ ఇటి తలుపు తట్టాను. తలుపు తెరుచుకుంది. ఎదురుగా శారద... ముసలితనానికి గుర్తుగా ముఖంలో ముడతలు పడ్డాయి. ఒక్క క్షణం నా వైపు తేరిపార చూసింది.

నవ్వుతూ "రండి రండి" అంది. ఆమె ముఖాన బొట్టు లేదు.

మంచి నీళ్ళిస్తూ "బాగున్నారా?" అంది.

"ఊ" అన్నాను.

ఇల్లంతా కలియజూశాను. ఏవేవో ఫోటోలున్నాయి. ఓ ఫోటోకి పెద్ద దండ వేసి వుంది.

శారద భర్త అయ్యుంటాడనుకున్నాను.

తన పిల్లల ఉద్యోగాల సంగతీ, తన భర్త చనిపోయిన సంగతీ... ఇంకా అవీ ఇవీ చెప్పింది. నా గురించి అడిగింది. చెప్పాను.

తర్వాత చాలాసేపు మాటల్లేవు.

తను గదిలోకెళ్ళి పుస్తకం తెచ్చి, ఎన్నో సంవత్సరాల క్రితం నేను రాసిన ఆటోగ్రాఫ్ చూపించింది. ఆశ్చర్యపోయాను.

"నన్ను ఎప్పుడూ ఒక ప్రశ్న వేధించేది. అడగనా?" అంది.

"అడగండి!" అన్నాను.

"నేను అప్పుడు ఆ ఇంట్లో వారం రోజులు వున్నాను. నా పాట వినాలనిపించలేదా?"

"వినాలనిపించింది. మాట్లాడాలని.... హృదయంలో నిలపలేకపోతున్న ప్రేమ తెలపాలని..."

"మరి ఎందుకని?" "అందమైన, చక్కగా పాడగలిగిన మీకు, నేను తెలియకముందే ఎంతోమంది, వాళ్ళ ప్రేమల్ని తెలియపర్చి వుంటారనుకున్నాను"

"ఔను! తెలియపర్చారు."

"మరి ఆ స్థితిలో నా ప్రేమను తెలియపరిచితే నేను చులకన కానా? అందుకే ప్రేమావేశాన్ని చంపుకుని మౌనం వహించాను"

"చులకన అయ్యే అవకాశముంది. కాని ఆ మౌనమే నన్ను చాలా ప్రశ్నించింది. బాధించింది. మా ఇంట్లో వాళ్ళు నా పెళ్ళి ప్రస్తావన తెచ్చినప్పుడు మీరు గుర్తుకొచ్చారు"

"నా మౌనమే మీకు ప్రశ్న. అదే నాకు మీ ప్రేమను తెలుసుకునే జవాబు" అంటూ నవ్వాను.

ఆమె కళ్ళను మెరిపించి, అలలు అలలుగా నవ్వింది.

"వెళ్ళొస్తాను" అని బయలుదేరాను.

నవ్వుతూ తల వూపింది. ఆమె నా వెంట గేటు దాకా వచ్చింది. ఆమె ముఖంలో నవ్వు ఇంకా కనపడుతూనే వుంది.




## కొత్త సెంటర్

ప్రెస్ షో చూసి బయటకు వస్తున్న రిపోర్టర్‌ను నిర్మాత అడిగారు 'ఎలా వుంది మా సిన్మా! ఎ– సెంటర్‌లో బాగా ఆడుతుందా? లేక 'బి. సి.' సెంటర్లలోనా?"

"డి. సెంటర్‌లో"

"ఇదేమిటి కొత్తగా 'డి'?"

"డి అంటే దూరదర్శన్‌లో"

– వి.మంజురాణి



## "........వలస పోతున్న కోయిలా!"

ఓ వలసపోతున్న కోయిలా
ప్రతి వసంతానికీ రా ఇలా
మళ్ళీ నీవు వచ్చేది ఎప్పుడో? ఏమో?
కానీ,
అప్పటివరకూ మాకు తోడు నీ తీపి గురుతులే సుమా
నీవు పాడిన పాటలే సుప్రభాతాలు మాకు
నీవు నేర్పిన పలుకులు మేము చేసే పనికి ములుకులు
నీవిచ్చిన స్ఫూర్తి రేపటి మా జాగృతి
ప్రకృతిని పులకింపచేసిన నీ జ్ఞాపకాలు ఎలా మర్చిపోగలం
కానీ మాకు తెలుసు ఇది తప్పదని
ప్రకృతిని పరవశింపజేసిన కోయిల
తాను సేద తీర్చుకునేది తన చిన్న గూటిలో మాత్రమేనని
అందుకే ఓ కోయిలా
నీ పయనం కావాలి సౌఖ్యం
నీ చలనం అందుకోవాలి కీర్తి శిఖరం!

– అడుసుమల్లి ప్రభాకరరావు